ఎన్నికల కోడ్ నిబంధనలను పాటించాలి

సీఐ శంకర్‌కుమార్

యాచారం, మార్చి 24: ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలని సీఐ శంకర్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని గ్రామాల్లో అక్రమంగా బెల్టు షాపులు నిర్వహిస్తే క్రిమినల్ కేసులను నమోదు చేస్తామని పేర్కొన్నారు. ఇప్పటికే ముమ్మరంగా దాడులు నిర్వహించి మద్యం స్వాధీనం చేసుకోవడంతో పాటు పలువురిపై కేసులను నమోదు చేసినట్లు గుర్తు చేశారు. మండలంలో గున్‌గల్, యాచారం, మాల్‌లో వాహనాల తనిఖీలు ముమ్మరం చేయనున్నట్లు ఆయన తెలిపారు. ముఖ్యంగా మాల్‌లో ఉన్న బార్డర్ చెక్‌పోస్టును పకడ్బందీగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎన్నికల కోడ్ ఉన్నందున రూ.50 వేలకు మించి నగదు తీసుకుపోవద్దని ఆయన సూచించారు. అత్యవసరంలో అధిక మొత్తంలో నగదు తీసుకెళ్తే సంబంధిత రశీదులు ఉండాలని తెలిపారు. మద్యం, బంగారం, నగదు తరలింపుపై నిఘా ఉంచినట్లు తెలిపారు. సోషల్ మీడియాలో రెచ్చగొట్టే వ్యాఖ్యలు, పోస్టులు చేయొద్దని సూచించారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన కోరారు.

భువనగిరి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా బీసీని ప్రకటించాలి

ఇబ్రహీంపట్నం, మార్చి 24 : భువనగిరి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థిగా బీసీని ప్రకటించాలని ఆ పార్టీ సీనియర్ నాయకుడు ఈసీ శేఖర్‌గౌడ్ ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. భువనగిరి పార్లమెంట్ సీటును ఇప్పటికే బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు బీసీలకు కేటాయించారని ఆయన గుర్తు చేశారు.

హామీలను అమలు చేయాలి

ఇబ్రహీంపట్నంరూరల్, మార్చి 24 : నిరుద్యోగ యువతకు ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని బీజేవైఎం జిల్లా అధికార ప్రతినిధి విజయ్‌కుమార్ అన్నారు. ఆదివారం ఇబ్రహీంపట్నంలో ఆయన మాట్లాడుతూ.. మెగా డీఎస్సీతో ఉపాధ్యాయ ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పిన ప్రభుత్వం టెట్‌రూపంలో మరోసారి నిరుద్యోగ యువతపై భారం మోపుతుందన్నారు. గతంలో టెట్ పరీక్ష రుసుము ఒక్క పేపరుకు రూ.200, రెండు పేపర్లకు రూ.300 చొప్పున ఉండేదని, కానీ ఇటీవల టెట్ నోటిఫికేషన్‌లో పరీక్ష రుసుము ఒక్క పేపర్‌కు రూ.1000, రెండు పేపర్లకు రూ.2వేలు నిర్ణయించటం సరైన పద్ధతి కాదన్నారు.

గతేడాది నిండుకుండలా కళకళలాడుతున్న మేడిపల్లి సాలి చెరువు (ఫైల్)

ప్రస్తుతం చుక్కనీరు లేకుండా ఎండిపోయిన మేడిపల్లి సాలి చెరువు

నాడు వైభవం.. నేడు దుర్భిక్షం

- ఎండిపోతున్న చెరువులు, కుంటలు
- వట్టిపోతున్న బోరుబావులు
- పంటలను కాటేస్తున్న కరువు
- పైకిరాని పాతాల గంగా
- అల్లాడుతున్న అన్నదాతలు

యాచారం, మార్చి 23 : మండలంలో రోజురోజుకూ కరువు, కాటకాలు అలుముకుంటున్నాయి. పదేండ్లుగా చెరువులు, కుంటలు నిండి మత్తడి దుంకి రైతుల కళ్లల్లో ఆనందడోలికలు నింపాయి. బోరుబావుల్లో పుష్కలంగా నీరు ఉండటంతో పంటలకు సరిపడా నీరు అందింది. ఎటూ చూసిన పచ్చదనమే కనపించేది. రాసులకొద్ది ధాన్యం దిగుబడి రావడంతో రైతులు సుభిక్షంగా, సంతోషంగా ఉన్నారు. కానీ నేడు సీన్ రివర్స్ అయ్యింది. కాంగ్రెస్ పాలన వస్తూనే కరువును మూటగట్టుకొచ్చింది. నాడు నీటితో కళకళలాడిన చెరువులు, నేడు చుక్కనీరు లేక వెలవెలబోతున్నాయి. మండలంలోని అన్ని గ్రామాల్లో చెరువులు, కుంటలు చుక్కనీరు లేకుండా ఎండిపోతున్నాయి. దీంతో అన్నదాతలు నిత్యం అల్లాడుతున్నారు. పంటలకు సరిపడా నీరందక ఇప్పటికే ఎండుముఖం పట్టాయి. దీంతో రైతన్నలు ఎటూ తేల్చుకోలేని పరిస్థితి నెలకొంది. దీంతో సాగునీటి ఎద్దడి రైతన్నలకు భారమైంది. గత ఐదారేండ్లతో పోలిస్తే ఈ యాసంగిలో పంటల సాగు తగ్గింది. ముఖ్యంగా వరి పంటసాగు చాలా తగ్గింది. ఒకప్పుడు ఆయకట్టు ప్రాంతాల్లో విస్తారంగా పంటలు పండిన భూములు నేడు సాగునీరు లేక ప్రస్తుతం ఆ భూములు బీడు భూములుగా మారుతున్నాయి. రైతులు ఆహార పంటలను వదిలేసి వాణిజ్య పంటలపై మక్కువ పెంచుకుంటున్నారు. అందులోనూ నష్టాలు రావడంతో, కొంతమంది రైతులు ఉన్నకొద్దిపాటి నీటితో డ్రిప్పు పద్ధతితో కూరగాయల సాగును చేస్తున్నారు. బోరుబావులు ఎండి పోవడంతో కూరగాయలు సైతం ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పైగా కరెంటు ఎప్పుడు పోతుందో..ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితి నెలకొంది. దీంతో అప్పుడే కరెంట్ కోతలు సైతం మొదలయ్యాయి. సాగునీరు, విద్యుత్ సమస్య రైతుల పాలిట శాపంగా మారింది.

ఎండిపోతున్న చెరువులు

మండలంలో 6 పెద్ద చెరువులున్నాయి. 86 చిన్న చెరువు, కుంటలున్నాయి. గతంలో ఇవన్ని నిండా నీటితో కళకళలాడాయి. నేడు చుక్కనీరు లేక వెలవెల బోతున్నాయి. మండలంలోని మేడిపల్లి గ్రామానికి సాలి చెరువు, ఎక్వ చెరువు, ఊర చెరువులు ఉన్నాయి, తక్కళ్లపల్లి చెన్నారెడ్డి చెరువు, నల్లవెల్లి చెరువులు చుక్కనీరు లేకుండా ఎండిపోగా చింతపట్ల లక్ష్మణ చెరువు, తాటిపర్తి బందం చెరువులో కొద్దిపాటి నీరు నిల్వ ఉంది. ఇక కుంటలన్ని ఎండిపోగా, గ్రామానికి చెందిన మురుగునీరు, వృథానీరు వెళ్లే కుంటలు మాత్రం నీటితో ఉన్నాయి. కేసీఆర్ పాలనలో మూడుమార్లు మత్తడిపోసి వాగులు పారిన చెరువులు, కాలువలు, కుంటలు ఎండిపోయాయి. రానున్న రోజుల్లో సరిపడా వర్షాలు కురియకపోతే సాగునీరుతో పాటు తాగునీరు ఎద్దడి తప్పదని ప్రజలు పేర్కొంటున్నారు.

పైకిరాని పాతాలంలో గంగా

మండలంలో క్రమక్రమంగా భూగర్భజలాలు పూర్తిగా అడుగంటి పోతున్నాయి. బోరుబావుల్లో ఉన్న నీరు పాతాళానికి పడిపోతుంది. అసలే ఎండలు దంచి కొడుతుండటంతో ఇప్పటికే కొన్ని బోరుబావులు ఆపుతూ పోయగా, మరికొన్ని పూర్తిగా వట్టిపోయాయి. నూతనంగా బోర్లు వేసిన ఫలితం లేకుండా పోతుంది. 500నుండి 1000 ఫీట్లలోతు వరకు వేసినా చుక్కనీరు రాకపోవడంతో రైతులు లబోదిబో మంటున్నారు. వ్యవసాయాన్నే నమ్ముకున్న రైతులు చేసేదేమీలేక ఉన్న కొద్దిపాటి నీటితో పంటలు సాగుచేస్తున్నారు. మండలానికి సాగునీరు తీసుకొచ్చి రైతుల కష్టాలు తీర్చాలని ప్రజలు, ప్రజా ప్రతినిధులు కోరుతున్నారు.

డిండి జలాలు వచ్చేనా..?

గతంలో కేసీఆర్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన డిండి ప్రాజెక్ట్‌తో మండలానికి సాగునీరు సమస్య తీరనుందని రైతులు సంబుర పడ్డారు. డిండి నుంచి నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలం శివన్నగూడ రిజర్వాయర్ నుంచి మంతన్‌గౌరెల్లి మీదుగా చౌదర్‌పల్లి వద్ద 4టీఎంసీ సామర్థ్యం గల రిజర్వాయర్‌ను నిర్మించాలని గత ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి ఎంతగానో కృషి చేశారు. గతంలో పైపులైను వేసే ప్రాంతాలను ఆయన ఇంజినీర్లతో కలిసి సర్వే చేయించారు. ఈ ప్రయత్నం విజయవంతమైతే కరువు నేలపై సిరులు కురిసినట్లేనని రైతులు భావించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రావడంతో డిండి జలాల నీరు రావడంపై రైతుల ఆశలు ఆవిరైనట్లు భావిస్తున్నారు.

పంటలెండిపోతున్నాయి

సాగునీరు లేక క్రమంగా పంటలు పూర్తిగా ఎండు ముఖం పట్టాయి. వర్షాలను నమ్ముకొని పంటలు సాగుచేసిన రైతులకు నిరాశే మిగిలింది. ఎండలు దంచి కొట్టడంతో పంటలు ఎండిపోతున్నాయి. రానున్న రోజుల్లో వర్షాలు కురువకపోతే వరి, కూరగాయలు, ఆకుకూరల పంటలు మొత్తం దెబ్బతింటాయి. ఇప్పటికే రైతులు సగం ఆశలు కోల్పోయారు. సరిపడా వర్షాలు కురియకపోతే పంటలు చేతికిరాక రైతులు తీవ్రంగా నష్టపోతారు. కరెంటు కోతలు లేకుండా చూడాలి. రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలి.

– సాలయ్య, మేడిపల్లి

కిసాన్ మోర్చా జిల్లా కార్యదర్శిగా పీసరి గోపాల్‌రెడ్డి

చేవెళ్ల రూరల్, మార్చి 24 : కిసాన్ మోర్చా జిల్లా కార్యదర్శిగా చేవెళ్ల మండలం పల్గుట్ట గ్రామానికి చెందిన పీసరి గోపాల్ రెడ్డిని నియమించారు. ఆదివారం కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు జక్క రవీందర్ రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు కంజర్ల ప్రకాశ్, కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి మోర నర్సింహారెడ్డి, కార్యదర్శి జి.వెంకట్ రెడ్డి, మండల అధ్యక్షుడు దేవర పాండురంగారెడ్డి, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు ఉమాశంకర్ రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు వెంకట్ రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

29 నుంచి జిల్లా స్థాయి పోటీలు

కడ్తాల్, మార్చి 24 : తలకొండపల్లి మండల పరిధిలోని దేవుని పడకల్ గ్రామంలో వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలను నిర్వహిస్తున్నట్లు వాలీబాల్ యూత్ అసోసియేషన్ సభ్యులు తెలిపారు. ఈ నెల 29, 30వ తేదీల్లో పురుషుల రూరల్, ఉమెన్స్ ఓపెన్ కేటగిరి, పాఠశాల విద్యార్థులకు పోటీలు నిర్వహించనున్నట్లు పీఈటీ, వాలీబాల్ యూత్ అధ్యక్షుడు మల్లేశ్, ఉపాధ్యక్షుడు తిరుపతి పేర్కొన్నారు. పురుషుల విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచిన జట్టుకి రూ.30 వేలు, ద్వితీయ స్థానం జట్టుకి రూ.20 వేలు, మహిళల విభాగంలో తొలి, రెండవ స్థానంలో నిలిచిన జట్లకు రూ.20 వేలు, 10 వేలు అందజేస్తామని వారు వివరించారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

షాద్‌నగర్, మార్చి 24 : అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన ఫరూఖ్‌నగర్ మండలం వెలిజర్ల గ్రామంలో ఆదివారం జరిగింది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన మహేశ్వరం రామకృష్ణ (35) మేస్త్రి పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తుండేవాడు. గత గురువారం భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. ఇంటి నుంచి బయటకు వెళ్లిన రామకృష్ణ గ్రామంలోని నర్సింహారెడ్డి రైతు వ్యవసాయ పొలంలో మృతదేహం కనిపించింది. రామకృష్ణ మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని షాద్‌నగర్ సర్కార్ దవాఖానకు తరలించారు. మృతికి గల కారణాలు తెలియరాలేదని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నామని పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు.

ఓపెన్ జిమ్ ఏర్పాటుకు కృషి

- ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలుసుకుని సన్మానిస్తున్న జీఎస్ఐ గేటు సమీపంలోని మహవీర్ హరిణ వనస్థలి నేషనల్ పార్కు వాకర్స్ అసోసియేషన్ సభ్యులు

మన్సూరాబాద్, మార్చి 24: నాగోల్ డివిజన్ పరిధి జీఎస్ఐ గేటు సమీపంలోని మహవీర్ హరిణ వనస్థలి నేషనల్ పార్కు వాకర్స్ అసోసియేషన్ సభ్యులు ఇటీవల నూతన కమిటీని ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు ఆదివారం ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలుసుకుని సత్కరించారు. వాకర్స్ ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. యోగా షెడ్డు నిర్మాణం చేపట్టడంతో పాటు ఓపెన్ జిమ్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. మహవీర్ హరిణ వనస్థలి నేషనల్ పార్కులో త్వరలో మార్నింగ్ వాక్ చేపట్టి వాకర్స్ సమస్యలను స్వయంగా పరిశీలిస్తానని తెలిపారు. మార్నింగ్, ఈవినింగ్ వాక్‌కు వచ్చే వాకర్స్ కోసం యోగా షెడ్డుతో పాటు ఓపెన్ జిమ్‌ను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏ.విక్రమ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఏ.వెంకటేశ్‌గౌడ్, ఉపాధ్యక్షులు పోచబోయిన జగదీశ్‌యాదవ్, నర్సింహులు, రమేశ్, కార్యనిర్వాహక కార్యదర్శులు జగన్మోహన్‌రెడ్డి, విశ్వనాథ్, కార్యవర్గసభ్యులు శంకర్, కృష్ణ, కొలను శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

కడ్తాల్, మార్చి 24 : మండల పరిధిలోని మైసిగండి గ్రామానికి చెందిన జటావత్ గోర్యానాయక్ రెండు రోజుల క్రితం మృతి చెందాడు. ఆదివారం ఉదయం గ్రామానికి చెందిన పలువురు నాయకులు ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించాడు. గ్రామానికి చెందిన యువ నాయకుడు రాందాసునాయక్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి వ్యక్తిగతంగా రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో జవహర్‌లాల్‌నాయక్, జగన్‌నాయక్, పాండూనాయక్, కుమార్, మురళి తదితరులు పాల్గొన్నారు.

క్షయవ్యాధి నివారణకు కృషి చేయాలి

ఎల్బీనగర్, మార్చి 24: క్షయవ్యాధి నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ తెలిపారు. ఆదివారం ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినం సందర్భంగా నవభారతి నిర్మాణం ఫౌండేషన్, స్వప్న హాస్పిటల్ స్కూల్ ఆఫ్ నర్సింగ్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన క్షయ వ్యాధి నివారణ అవగాహన శిబిరం, ర్యాలీలో ఎమ్మెల్సీ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. డాక్టర్ రాబర్ట్ కోచ్ క్షయ వ్యాధిని గుర్తించడానికి సూక్ష్మజీవులను మొట్టమొదలు 24 మార్చి 1882లో గుర్తించినట్లు తెలిపారు. ఇందుకు గాను డాక్టర్ రాబర్ట్ కోచ్‌కు 1905లో వైద్యశాస్త్రంలో నోబెల్ బహుమతి ప్రదానం చేయడం జరిగిందని గుర్తు చేశారు. నాటి నుంచి ప్రపంచ వ్యాప్తంగా మార్చి 24న ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినంగా జరుపుకోవడం ప్రారంభమైందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ గైనకాలజిస్ట్, మేనేజింగ్ డైరెక్టర్ స్వప్న హాస్పిటల్ డాక్టర్ ఎం.స్వప్న కుమారి, నవభారతి నిర్మాణ ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల హేమంత్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రిశి, శిరీష, ఉదయ రంజిని స్మిత సౌమ్య పాల్గొన్నారు.

ర్యాలీలో ఎమ్మెల్సీ దయానంద్

చంద్రపురికాలనీలో పెండింగ్ పనులను పూర్తిచేస్తా..

కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డిని సత్కరిస్తున్న చంద్రపురికాలనీ నూతన కార్యవర్గసభ్యులు

మన్సూరాబాద్, మార్చి 24: మన్సూరాబాద్ డివిజన్ పరిధి చంద్రపురికాలనీ నూతన కార్యవర్గసభ్యులు ఆదివారం కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డిని మర్యాద పూర్వకంగా కలుసుకుని కాలనీ సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. చంద్రపురికాలనీలో అసంపూర్తిగా మిగిలిన అభివృద్ధి పనులను త్వరలో పూర్తి చేస్తామని తెలిపారు. కాలనీవాసుల కోసం ఓపెన్‌జిమ్‌ను మంజూరు చేయించడం జరిగిందని త్వరలో ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. అధ్యక్షుడు వెంకటరెడ్డి, ఉపాధ్యక్షుడు నాగేశ్వరరావు, సోమిరెడ్డి పాల్గొన్నారు.

పేదలకు సేవ చేయడమే లక్ష్యంగా..

ఆర్కేపురం, మార్చి 24 : రెడీ టూ సర్వ్ ఫౌండేషన్, అమ్మ హెల్పింగ్ హాండ్స్ ఆధ్వర్యంలో నీలోఫర్ ఎంఎన్‌జీ క్యాన్సర్ హాస్పిటల్ వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రెడీ టూ సర్వ్ ఫౌండేషన్ చైర్మన్ పెద్ది శంకర్ మాట్లాడుతూ.. పేద ప్రజల సేవే లక్ష్యంగా రెడీ టూ సర్వ్ ఫౌండేషన్ ముందుకెళ్తుందన్నారు. ప్రతి ఆదివారం ప్రభుత్వ హాస్పిటల్ వద్ద అన్నదాన కార్యక్రమం చేయడం జరుగుతుందన్నారు. ఇప్పటికే ఫౌండేషన్ ఆధ్వర్యంలో చాలా సేవా కార్యక్రమాలు చేస్తున్నామని, రానున్న రోజుల్లో సేవా కార్యక్రమాలను విస్తరిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో శిరీష, ప్రకాశ్ యాదవ్, చైతన్య, ప్రశాంత్, రామయ్య, మల్లికార్జున్, శ్రీనాథ్, ముత్యాలమ్మ, దేవి, చందు తదితరులు ఉన్నారు.

నీలోఫర్ ఎంఎన్‌జీ క్యాన్సర్ హాస్పిటల్ వద్ద అన్నదానం నిర్వహిస్తున్న పెద్ది శంకర్ తదితరులు

విరగబూసి.. జ్ఞాపకాలు గుర్తుచేసి..



పెద్దఅంబర్‌పేట, మార్చి 24: హోలీ అంటేనే రంగుల పండుగ. ఆ రంగులు సహజసిద్ధమైనవి అయితే ఆ వేడుకే వేరు. రెండు దశాబ్దాల కిందట సహజసిద్ధమైన సంప్రదాయ రంగులతో హోలీ చేసుకునేవారు. పూలతో తయారుచేసిన రంగులను చల్లుకునేవారు. కానీ, ఇప్పుడు పరిస్థితులు మారిపోయాయి. అప్పటి కప్పుడు దొరికే కెమికల్ రంగులకే డిమాండ్ ఉన్నది. పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీలో విరగబూసిన మోదుగు పూలు ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేస్తున్నాయి.

టీబీ నిర్మూలనకు సహకరించాలి

- వైద్య శాల డీన్ డాక్టర్ సత్యనారాయణ

చేవెళ్లటౌన్: ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు

చేవెళ్లటౌన్, మార్చి 24: ప్రపంచ టీబీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం చేవెళ్ల మండల కేంద్రంలోని డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి వైద్య కళాశాల ఆవరణలో ర్యాలీ నిర్వహించారు. టీబీ పైన కళాశాల విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య శాల డీన్ డాక్టర్ సత్యనారాయణ మాట్లాడుతూ.. టీబీని అంతం చేసేందుకు సహకరించాలన్నారు. వ్యాధిని నియంత్రించడంలో ఎదురవుతున్న సవాళ్లపై ప్రజలకు అవగాహన కల్పించాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ రాజేశ్వర్‌రావు, ప్రియాంక, రాహుల్ రెడ్డి, గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

విప్లవ వీరులకు నివాళి

నివాళి అర్పిస్తున్న సీపీఐ నాయకులు

పెద్దఅంబర్‌పేట, మార్చి 24: సీపీఐ అబ్దుల్లాపూర్‌మెట్ మండల సమితి ఆధ్వర్యంలో రావినారాయణరెడ్డి కాలనీలో విప్లవ వీరులు భగత్‌సింగ్, రాజుగురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. వారి పోరాట స్ఫూర్తిని గుర్తు చేసుకున్నారు. చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు రవీంద్రచారి, యాదిరెడ్డి, కౌన్సిలర్ పబ్బతి లక్ష్మణ్, అజ్మీర్ హరిసింగ్, నర్సింహ పాల్గొన్నారు

భక్తి శ్రద్ధలతో మట్టల ఆదివారం

హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారిపై ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు

మొయినాబాద్, మార్చి 24 : క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో మట్టల ఆదివారం పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈస్టర్ పండుగకు వారం రోజుల ముందు మట్టల ఆదివారం పండుగను జరుపుకొంటారు. ఈత మట్టలతో గ్రామాల్లోన్ని అన్ని చర్చిల వద్ద, గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తారు. యేసు ప్రభును ఆరాధిస్తూ ప్రత్యేక ప్రార్థనలతో ర్యాలీ నిర్వహించారు. మొయినాబాద్‌లోని మెథడిస్ట్ చర్చికి సంబంధించిన భక్తులు ఆదివారం మొయినాబాద్ మెథడిస్ట్ చర్చి జిల్లా అధికారి విజయరావు ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారిపై మట్టలు పట్టుకుని ర్యాలీ నిర్వహించారు.

నూతన కార్యవర్గం

మొయినాబాద్, మార్చి 24 : చిలుకూరు గ్రామంలో కల్లు గీత పారిశ్రామిక సహకార సంఘం కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. అబ్కారి శాఖ ఇన్‌స్పెక్టర్ ఎండీ రహీముద్దీన్ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. నూతన అధ్యక్షుడిగా సుభాష్‌గౌడ్, ఉపాధ్యక్షులుగా కృష్ణగౌడ్, డైరెక్టర్లు విఠల్‌గౌడ్, పాండుగౌడ్, వెంకటేశ్‌గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

సెంట్రింగ్ బాక్సులు దొంగిలిస్తున్న ముగ్గురు నిందితుల అరెస్ట్

నిందితులను అరెస్ట్ చేసి వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

ఆదిబట్ల, మార్చి 24: కొత్తగా నిర్మిస్తున్న ఇండ్లపై రెక్కి నిర్వహించి, సెంట్రింగ్ బాక్సులను ఎత్తుకెళుతున్న ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన ఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఆదివారం సీఐ రాఘవేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం కొంత మంది కొత్తగా నిర్మిస్తున్న ఇండ్లను టార్గెట్‌గా చేసుకుని సెంట్రింగ్ బాక్సులను ఎత్తుకెళుతున్నారు. దీంతో ముగ్గురు బాధితులు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని నిందితులను అరెస్ట్ చేశారు. నిందితులు నసీర్‌ఆలీ, మహమ్మద్‌ఫయాజ్, వక్కరేణి కుమార్‌లను అరెస్ట్ చేసి వారి నుంచి రూ. లక్షా 85వేలను రికవరీ చేసినట్లు తెలిపారు. నిందితులను రిమండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.